ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY

వికారాబాద్ - మేడ్చల్

జిల్లాల వార్తలు

5

సోమవారం 12 ఫిబ్రవరి 2024

వారాంతం కావడంతో కోట్‌పల్లి ప్రాజెక్టుకు సందర్శకుల తాకిడి పెరిగింది. ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సందర్శకులు సరదాగా గడిపారు. ప్రాజెక్టు నీటిలో సెల్ఫీలు, బోటింగ్ చేస్తూ ఎంజాయ్ చేశారు. ప్రాజెక్టు పరిసరాలను తిలకిస్తూ ఉల్లాసంగా గడిపారు.

- ధారూరు, ఫిబ్రవరి 11



చూసేందుకు రెండు కళ్లు సరిపోవడం లేదు కదూ.. ఇంతటి పచ్చదనం చూసి కోనసీమ అనుకునేరు... కాదు..కాదు మేడ్చల్- మల్కాజ్‌గిరి జిల్లా ఘట్‌కేసర్ మున్సిపాలిటీ బొక్కోనిగూడలోని ఎరిమల్లెవాగు పరివాహక ప్రాంతం. యాసంగిలో రైతులు వరి సాగు చేయడంతో కనుచూపుమేర పచ్చని పైరు అదరహో అనిపిస్తోంది. పొలాల మధ్యలో తాటిచెట్లు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. పచ్చని పైర్లు గలగలా సవ్వడి చేస్తున్నాయి. పంట పొలాలను చూసి ప్రకృతి ప్రేమికులు పరవశించిపోతున్నారు. పైర్లను చూసి రైతుల మోములు వికసిస్తున్నాయి.

- ఘట్‌కేసర్, ఫిబ్రవరి 11



ఎంపీడీవోల బదిలీలు



వికారాబాద్ జిల్లాలో 11 మంది, మేడ్చల్ జిల్లాలో ముగ్గురు ట్రాన్స్‌ఫర్

వికారాబాద్/మేడ్చల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఎన్నికల బదిలీలు కొనసాగుతున్నాయి. వికారాబాద్ జిల్లాలో పనిచేస్తున్న 11 మంది ఎంపీడీవోలను ఇతర జిల్లాలకు బదిలీ చేస్తూ పంచాయతీరాజ్ అండ్ గ్రామీణ ఉపాధిశాఖ కమిషనర్ అనితా రామచంద్రన్ ఉత్తర్వులు జారీ చేశారు. పెద్దేముల్ ఎంపీడీవో బండి లక్ష్మప్ప, పూడూరు ఎంపీడీవో ఉమాదేవి, బంట్వారంఎంపీడీవో బాలయ్యలను సిద్దిపేట జిల్లాకు బదిలీ చేయగా, దోమ ఎంపీడీవో జయరాం, తాండూరు ఎంపీడీవో సుదర్శన్‌రెడ్డి, దౌల్తాబాద్ ఎంపీడీవో తిరుమలస్వామి, పరిగి ఎంపీడీవో శేషగిరిశర్మలు నల్లగొండ జిల్లాకు బదిలీ అయ్యారు. కోట్‌పల్లి ఎంపీడీవో లక్ష్మీనారాయణను జనగాం జిల్లాకు, మోమిన్‌పేట్ ఎంపీడీవో శైలజను రంగారెడ్డి జిల్లాకు బదిలీ చేశారు. కులకచర్ల ఎంపీడీవో నాగవేణిని యాదాద్రి-భువనగిరి జిల్లాకు, వికారాబాద్ ఎంపీడీవో ఎం.సత్తయ్యను సంగారెడ్డి జిల్లాకు బదిలీ చేశారు. కాగా, రంగారెడ్డి జిల్లా నుంచి బి.నర్సింహులు, జి.విజయలక్ష్మి, జి.హరీష్‌కుమార్, కె.వినయ్‌కుమార్, కె.రామకృష్ణ, జె.రాఘవులు, సి.అనురాధ, హెచ్.మహేష్‌బాబు, సంగారెడ్డి జిల్లా నుంచి ఎ.రాములు, కె.విశ్వప్రసాద్, యాదాద్రి-భువనగిరి జిల్లా నుంచి కె.ప్రభాకర్‌రెడ్డిలను వికారాబాద్ జిల్లాకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. జిల్లాలో 18 మండల పరిషత్తుల్లో 18 మంది ఎంపీడీవోలు ఉండాల్సి ఉండగా, ప్రస్తుతం 15 మంది ఎంపీడీవోలు పనిచేస్తున్నారు. వీరిలో 11మంది ఎంపీడీవోలు మూడేళ్లకు పైగా ఇక్కడే విధులు నిర్వహిస్తుండగా, నలుగురు ఎంపీడీవోలు ఇదే జిల్లాకు చెందిన వారుఉన్నారు. ఇదిలా ఉంటే, బదిలీ అయిన ఎంపీడీవోలను 12వ తేదీ లోగా రిలీవ్ చేయాలని, బదిలీపై కేటాయించిన జిల్లాల్లో 13వ తేదీలోగా రిపోర్ట్ చేయాలని పీఆర్‌అండ్‌ఆర్‌ఈ కమిషనర్ ఆదేశించారు.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ముగ్గురు

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ముగ్గురు ఎంపీడీవోలు బదిలీ అయ్యారు. జె.పద్మావతి(మేడ్చల్), జి.వాణి(శామీర్‌పేట), వై.అరుణరెడ్డి(ఘట్‌కేసర్)లు రంగారెడ్డి జిల్లాకు బదిలీ కాగా, రంగారెడ్డి జిల్లా నుంచి ఆర్.మమత, జి.వసంతలక్ష్మి, యాదాద్రి జిల్లాకు చెందిన లెంకెల గీతారెడ్డిలు బదిలీపై మేడ్చల్ జిల్లాకు రానున్నారు. కాగా లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఈసీ మార్గదర్శకాల మేరకు శనివారం తహసీల్దార్లను బదిలీ చేయగా, తాజాగా ఎంపీడీవోలను బదిలీ చేస్తూ ఆదివారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ఇదిలా ఉంటే, కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఇతర శాఖల్లోనూ బదిలీలకు రంగం సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది.

ఖరారుకాని ముహూర్తం

● పార్లమెంట్, అసెంబ్లీ సమావేశాల తర్వాతే కాంగ్రెస్‌లో పట్నం దంపతుల చేరిక



తాండూరు,ఫిబ్రవరి11: పార్లమెంట్, శాసన సభ సమావేశాలు జరుగుతుండటంతో ఎమ్మెల్సీ, మాజీ మంత్రి మహేందర్ రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి కాంగ్రెస్‌లో చేరికకు మరింత సమయం పట్టే అవకాశం ఉంది. ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన మహేందర్‌రెడ్డి దంపతులు ఢిల్లీలో రాహుల్‌గాంధీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరాలని నిర్ణయించారు. పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో రాహుల్‌గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్‌ఖర్గే బిజీగా ఉన్నారు. మహేందర్‌రెడ్డి దంపతులను ఢిల్లీకి తీసుకుపోవాల్సిన సీఎం శాసనసభ సమావేశాల్లో బిజీగా ఉన్నారు. ఈ సమావేశాలు ముగిసిన వెంటనే ఢిల్లీలో కాంగ్రెస్‌లో చేరికకు సమయం తీసుకునే అవకాశం ఉంది. అయితే ఈనెల 16వ తేదీ తర్వాత కొడంగల్‌లో సీఎం భారీ బహిరంగసభ నేపథ్యంలో రేవంత్‌రెడ్డి సమక్షంలో మహేందర్‌రెడ్డి తన అనుచరులను కాంగ్రెస్‌లో చేర్చుకునే అవకాశం ఉంది. ఇప్పటికే మహేందర్‌రెడ్డి తనఅనుచరులను ఇంటికి పిలిపించుకుని మాట్లాడారు.

రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో అంతోఇంతో సాగునీటి వనరులు ఉండగా, వికారాబాద్ జిల్లా మాత్రమే ఎడారిగా మారుతోంది. జిల్లాను ప్రభావితం చేసే ప్రధాన సమస్య సాగునీరు. ఈ ప్రాంతంలో సాగునీటి వనరులు లేక రైతులు పంటల సాగుకు వర్షం, బోర్ల పైనే ఆధారపడుతున్నారు. ప్రస్తుతం జిల్లాకు చెందిన రేవంత్ రెడ్డి సీఎం కావడం, స్పీకర్‌గా ప్రసాద్‌కుమార్, పరిగి ఎమ్మెల్యేగా రామ్మోహన్‌రెడ్డి ఎన్నిక కావడంతో పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుపై రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఈ సారి సాగునీటి సమస్య పరిష్కారం అవుతుందని ఆశగా ఎదురుచూస్తున్నారు.



పాలమూరు- రంగారెడ్డిపైనే ఆశలు!

- నిజాం కాలంలో నిర్మించిన చెరువులే దిక్కు
- ప్రస్తుతం రెండు శాతం నీరందని పరిస్థితి
- కొత్త ప్రభుత్వంలో అన్నదాతల్లో చిగురిస్తున్న ఆశలు
- ప్రాజెక్టు పూర్తయితే సాగులోకి 3.28 లక్షల ఎకరాలు

జిల్లాలో సాగుకు అనువైన భూములు ఆరు లక్షల ఎకరాలు

పరిగి, ఫిబ్రవరి 11 : సాగునీటి సమస్య వికారాబాద్ జిల్లా రైతులను వెంటాడుతోంది. ప్రస్తుతం రైతులు బోర్లు, వర్షాధారంగానే వ్యవసాయం చేస్తున్నారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు పూర్తయితే సాగునీటి సమస్య పరిష్కారం అవుతుందని భావించినా.. దాని విషయంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లుగా కాలయాపనతో సరిపెట్టింది. అయితే కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం, సీఎం రేవంత్‌రెడ్డి జిల్లాకు చెందినవారే కావడంతో ఈ ప్రాజెక్టు పూర్తవుతుందని జిల్లా రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. జిల్లాలో 8,73,477 ఎకరాల భూములు ఉండగా, ఆరు లక్షల ఎకరాలే సాగుకు అనువైనవి. ఇందులో నిజాంకాలంలో నిర్మించిన చెరువుల నుంచి పదిశాతం భూములకు సాగునీరు అందాల్సి ఉండగా ప్రస్తుతం రెండుశాతం కూడా అందడం లేదు. గత ప్రభుత్వం మిషన్ కాకతీయ ద్వారా చెరువుల కట్టలను వెడల్పు చేసినా చెరువుల్లో పూడికలు తీయకపోవడంతో రెండు నెలలకే ఎండిపోతున్నాయి. దీంతో ఆశించిన విధంగా పంటలు పండటం లేదు.



ఎత్తిపోతల కోసం సర్వే చేస్తున్న అధికారులు (ఫైల్)

బోరుబావుల ఆధారంగానే..

జిల్లాలోని 20 మండలాల్లో 70 వేల వ్యవసాయ బోర్లు ఉన్నాయి. పరిగి, తాండూరు, కొడంగల్ ప్రాంత రైతులు ఎక్కువగా బోర్లపైనే ఆధారపడుతూ దాదాపు లక్ష ఎకరాల్లో సాగు చేస్తున్నారు. యాసంగిలో 90శాతం భూములు బీడుగానే ఉంటున్నాయి. దివంగత మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో ప్రతిపాదించిన చేవెళ్ల-ప్రాణహిత ప్రాజెక్టుకు వికారాబాద్ ప్రాంతమే చివరిది. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక చేవెళ్ల-ప్రాణహితను డిజైన్‌ను మార్చి అప్పటి సీఎం కేసీఆర్ జిల్లాకు పరిమితం చేశారు. తెలంగాణ రిటైర్డు ఇంజనీర్ల ఫోరం ప్రతిపాదించిన పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ప్రాజెక్టు నిర్మిస్తే జిల్లాలో సాగునీటి సమస్య పరిష్కారం అవుతుంది. పాలమూరు, రంగారెడ్డి, నల్గొండ జిల్లాలోని 58 మండలాల్లోని పది లక్షల ఎకరాలకు సాగునీరు అందించే విధంగా ఈ ప్రాజెక్టును డిజైన్ చేశారు.

'పాలమూరు ఎత్తిపోతల'ను సాధిస్తాం



పాలమూరు ఎత్తిపోతల ప్రాజెక్టు ద్వారా జిల్లాకు సాగునీటిని సాధించి తీరుతాం. గత ప్రభుత్వం ఈ ప్రాజెక్టును పూర్తిగా విస్మరించింది. చేవెళ్ల ప్రాణహితను దారి మళ్లించింది. జిల్లాకు తీవ్ర అన్యాయం చేసింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. పాలమూరు ఎత్తిపోతల ద్వారా ఏడాది లోపు నీళ్లు తీసుకువస్తాం. చేవెళ్ల - ప్రాణహిత ద్వారా కూడా సాగునీరు తెచ్చేందుకు కృషి చేస్తాం.

- రామ్మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే, పరిగి

పాత ప్రతిపాదనలతో పూర్తి చేస్తే..

ప్రస్తుతం జిల్లాకు చెందిన రేవంత్‌రెడ్డి సీఎం కావడం, స్పీకర్‌గా ప్రసాద్, పరిగి ఎమ్మెల్యేగా రామ్మోహన్‌రెడ్డి ఎన్నిక కావడంతో ప్రాజెక్టుపై రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఈసారి సాగునీటి సమస్య పరిష్కారం అవుతుందని ఆశలు పెట్టుకున్నారు. ప్రస్తుతం పరిగి ప్రాంతానికి సాగునీరు అందించేందుకు అంతారం దగ్గర 16టీఎంసీలు, కేపీ లక్ష్మీదేవిపల్లి దగ్గర 10 టీఎంసీల కెపాసిటీ గల రిజర్వాయర్లు నిర్మించాలని ప్రతిపాదించారు. ఆ తర్వాత అంతారంను తొలగించారు. లక్ష్మీదేవిపల్లి దగ్గర 10 నుంచి రెండు టీఎంసీలకు తగ్గించారు. ప్రతిపాదనలో తగ్గించిన ప్రాజెక్టుతో అన్ని మండలాలు కవరయ్యే పరిస్థితి ఉండదు. పాత ప్రతిపాదనతో ఈప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే జిల్లాలో 3.28లక్షల ఎకరాల భూములు సాగులోకి వస్తాయి. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల నుంచి అధికార పార్టీకి చెందినవారే ఎమ్మెల్యేలుగా ఉన్నారు. వారు చిత్తశుద్ధితో కృషి చేస్తే పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టును పూర్తి చేయడం పెద్ద సమస్యేమీ కాదు. ఇప్పటికిప్పుడు ప్రభుత్వం నిధులు మంజూరు చేసి చిత్తశుద్ధితో పనులు చేపడితే 2024 చివరి నాటికి దాదాపు 80 శాతం పనులు పూర్తి చేయవచ్చు. జిల్లాకు పాలమూరు ఎత్తిపోతల ద్వారా సాగునీరు తీసుకురావడంతో జిల్లా సస్యశ్యామలం అయ్యే అవకాశం ఉంది.

ప్రాజెక్టు పూర్తయితే ...

వికారాబాద్ జిల్లాలోని 18 మండలాలకు 3.28 లక్షల ఎకరాల భూమికి సాగునీరు అందనుంది. పరిగి నియోజకవర్గంలోని ఐదు మండలాలకు లక్షా 8వేల ఎకరాలు, తాండూరు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లోని 98,800 ఎకరాలు, వికారాబాద్ నియోజకవర్గంలోని ఆరు మండలాల్లోని 53,200 ఎకరాలు, కొడంగల్ నియోజకవర్గంలోని ఐదు మండలాల్లోని 1.08 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుంది. ఈ ప్రాజెక్టుకు మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి హయాం నుంచి ప్రతిపాదనలు కొనసాగుతూనే ఉన్నాయి. మాజీ సీఎం కేసీఆర్ కూడా ఈ ప్రాజెక్టును నిర్మించి ఉమ్మడి జిల్లాకు సాగునీరు అందిస్తానని ఎన్నికల సందర్భంగా నాలుగుసార్లు హామీ ఇచ్చారు. మొదట్లో రూపొందించిన ప్రతిపాదన కాకుండా డిజైన్ మార్చి దిండి వరకు పొడిగించారు.



ఎత్తిపోతల పథకం పూర్తయితే ఇలా.. పచ్చని పంటలు

మున్సిపల్‌లో ముసలం!

- ● వికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్, వైస్ చైర్‌పర్సన్లపై అవిశ్వాసం
- ● రంగం సిద్ధం.. విప్ జారీకి బీఆర్ఎస్ ప్లాన్
- ● 34 వార్డులకు గాను 33 మంది కౌన్సిలర్లు
- ● అవిశ్వాసానికి కలెక్టర్ వద్దకు వెళ్లేందుకు కౌన్సిలర్ల నిర్ణయం

వికారాబాద్, ఫిబ్రవరి11: వికారాబాద్ మునిసిపాలిటీలో మళ్లీ ముసలం తలెత్తింది. చైర్‌పర్సన్ మంజుల, వైస్ చైర్ పర్సన్ పుష్పలతారెడ్డిలపై మరోసారి అవిశ్వాసం ప్రకటించే అంశం తెరపైకి వచ్చింది. బీఆర్ఎస్ పార్టీకి చెందిన చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్లపై కొంతకాలంగా అవిశ్వాసం ప్రకటిస్తూ అప్పట్లో సొంత పార్టీ కౌన్సిలర్లు ఉన్నతాధికారులకు లేఖలు ఇచ్చిన ఘటన రాష్ట్రంలో కలకలం రేపిన విషయం తెలిసిందే. రాష్ట్రంలో తొలిసారిగా వికారాబాద్ మునిసిపాలిటీలోనే బీఆర్ఎస్ కౌన్సిలర్లు సొంత (అప్పుడు) పార్టీ చైర్ పర్సన్, వైస్ చైర్ పర్సన్‌లపై అవిశ్వాసం ప్రకటించేందుకు తీవ్ర ప్రయత్నం చేయగా, అవిశ్వాస గండం తప్పించుకునేందుకు హైకోర్టును ఆశ్రయించి స్టే పొందిన విషయం తెలిసిందే. కాగా, బీఆర్ఎస్‌పార్టీకి చెందిన మునిసిపల్ చైర్ పర్సన్, వైస్‌చైర్‌పర్సన్లు అసెంబ్లీ ఎన్నికల సమయంలో రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన విషయం తెలిసిందే. దూకుడుగా వ్యవహరిస్తున్న వారికి అవిశ్వాసంతో చెక్ పెట్టాలని బీఆర్ఎస్ ముఖ్య నాయకులు పట్టుదలతో ఉన్నారు. మునిసిపాలిటీలో మొత్తం34 వార్డులు ఉన్నాయి. మునిసిపల్ ఎన్నికల్లో 25మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు విజయం గెలుపొందగా, కాంగ్రెస్ ఏడుగురు, ఎంఐఎం, బీజేపీల్లో ఒక్కో కౌన్సిలర్ గెలుపొందారు. స్వతంత్ర అభ్యర్థిగా గెలుపొందిన కౌన్సిలర్, కాంగ్రెస్ పార్టీకి మరో కౌన్సిలర్ బీఆర్ఎస్‌లో చేరడంతో వికారాబాద్ మునిసిపాలిటీలో బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ల సంఖ్య 27 మందికి పెరిగింది. రెండున్నరేళ్ల కిందట బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ నర్సింహులు గుండెపోటుతో మృతి చెందారు. దీంతో బీఆర్ఎస్ కౌన్సిలర్ల సంఖ్య 26కు తగ్గింది.



అగ్గి రాజేసిన పదవుల పంచాయితీ

చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ పదవులు బీఆర్ఎస్ పార్టీలో అగ్గి రాజేసింది. చైర్‌పర్సన్ పదవికి మంజుల రమేష్, పుష్పలతారెడ్డి, వైస్ చైర్‌పర్సన్ పదవికి శంషాద్ బేగం, అనంతరెడ్డిలు పోటీపడ్డారు. ఒప్పందం ప్రకారం మొదటరెండున్నరేళ్లు మునిసిపల్ చైర్‌పర్సన్ పదవిలో మంజుల రమేష్, తరువాత రెండున్నరేళ్లు లంకా పుష్పలతారెడ్డి, వైస్ చైర్మన్ పదవికి రెండున్నరేళ్లు శంషాద్‌బేగం, మరో రెండున్నరేళ్లు అనంత్‌రెడ్డి కొనసాగేలా పార్టీ ముఖ్య నేతల ఎదుట ఒప్పందం చేసుకున్నారు. కాగా, రెండున్నర సంవత్సరాల పదవీ కాలం పూర్తయినా చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్‌లు తమ పదవులు వీడేందుకు ససేమిరా అనడంతో ఆశావహులు కంగుతిన్నారు. అప్పటి స్థానిక ఎమ్మెల్యే, జిల్లా పార్టీ అధ్యక్షుడు మెతుకు ఆనంద్ వారికి నచ్చజెప్పినా చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ తమ పదవులు వీడేందుకు అంగీకరించలేదు. సొంతపార్టీ కౌన్సిలర్లు అందరూ ఒకవైపు, చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ మరోవైపుగా కొనసాగారు. ఈ వ్యవహారాన్ని చక్కదిద్దేందుకు అప్పటి జిల్లా మంత్రి సబితారెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డి పలుమార్లు ప్రయత్నించినా కొలిక్కిరాలేదు. చివరకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, అప్పటి మునిసిపల్, ఐటీ మంత్రి కేటీఆర్ చెప్పినా వారు తమ పదవులు వీడేందుకు ససేమిరా అనడంతో బీఆర్ఎస్ కౌన్సిలర్ల మధ్య విబేధాలు తారాస్థాయికి చేరాయి. పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో బీఆర్ఎస్ కౌన్సిలర్లు తమ పార్టీకి చెందిన చైర్‌పర్సన్ మంజుల, వైస్‌చైర్‌పర్సన్ శంషాద్‌బేగంపై అవిశ్వాసం ప్రకటిస్తూ జిల్లా కలెక్టర్‌కు లేఖ అందజేశారు. అయితే చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ హైకోర్టును ఆశ్రయించడంతో తాత్కాలికంగా సమసిపోయింది.

పార్టీ మారిన చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్

అసెంబ్లీ ఎన్నికలకు ముందు మునిసిపల్ చైర్‌పర్సన్ మంజుల రమేష్, వైస్ చైర్‌పర్సన్ శంషాద్ బేగంతో పాటు మరో కౌన్సిలర్ బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎన్నికల అనంతరం సైతం మరో ఇద్దరు బీఆర్ఎస్ కౌన్సిలర్లు స్వాతి రాజ్ కుమార్, గాయత్రి లక్ష్మణ్‌లు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ప్రస్తుతం కౌన్సిల్‌లో బీఆర్ఎస్ కౌన్సిలర్లు 20 మంది ఉండగా, కాంగ్రెస్ కౌన్సిలర్ల సంఖ్య 11 మందికి పెరిగింది. బీజేపీ, ఎంఐఎంలకు ఒక్కో కౌన్సిలర్ ఉన్నారు. చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్‌లపై అవిశ్వాసం ప్రకటించేందుకు అవసరమైన కౌన్సిలర్ల బలం కూడగట్టుకోవడంలో బీఆర్ఎస్ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్‌లపై మరోసారి అవిశ్వాసం ప్రకటిస్తూ బీఆర్ఎస్ కౌన్సిలర్లు తీసుకున్న నిర్ణయానికి మద్దతుగా ఇతర పార్టీల కౌన్సిలర్లు కూడా సంతకాలు చేసినట్లుగా తెలుస్తోంది.



మంజుల



పుష్పలతారెడ్డి

పార్టీ విప్ జారీతో కట్టడి..

ఇదిలా ఉంటే, మునిసిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్‌లపై అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టేందుకు రంగం సిద్ధం చేస్తున్న బీఆర్ఎస్ వ్యూహాత్మకంగా ముందుకు సాగుతున్నట్లు తెలుస్తోంది. పార్టీ బీ-ఫాంతో గెలుపొందిన ప్రజాప్రతినిధులు పార్టీ వ్యతిరేక విధానాలకు పాల్పడినట్లయితే వారిపై చర్యలు తీసుకునేందుకు వీలుగా విప్ జారీ చేయాలని బీఆర్ఎస్ పార్టీ భావిస్తున్నట్లు సమాచారం. విప్ జారీ చేస్తే పార్టీ బీ-ఫారంపై గెలుపొంది ఇతర పార్టీలోకి మారిన కౌన్సిలర్లను కట్టడి చేయవచ్చని బీఆర్ఎస్ నాయకులు భావిస్తున్నారు. విప్ జారీ చేయడం ద్వారా చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్‌లను పదవీచ్యుతులను చేయవచ్చన్న ధీమాలో బీఆర్ఎస్ నాయకులున్నారు. ప్రస్తుతం చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ పదవుల్లో కొనసాగుతున్న వారిని పదవుల్లో నుంచి తప్పించాలనే బీఆర్ఎస్ నిర్ణయానికి ఇతర పార్టీల మద్దతు కూడా ఉందనే ప్రచారం జరుగుతుండడం వికారాబాద్‌లో మరోసారి పొలిటికల్ హీట్ పెంచింది.



విద్యార్థినులతో మాట్లాడుతున్న లింగ్యానాయక్

విద్యార్థుల ఆరోగ్యం మెరుగుపడింది

- ●జాండీస్ సోకిన 300మందికి చికిత్సలు
- ● అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

వికారాబాద్, ఫిబ్రవరి11: కొత్తగడి బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో జాండీస్‌తో అస్వస్థతకు గురైన 300 మంది విద్యార్థినుల ఆరోగ్యం మెరుగుపడిందని వికారాబాద్ అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆదివారం ఆయన గురుకుల పాఠశాలను సందర్శించి విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితులను ప్రిన్సిపాల్ అపర్ణ, విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినులు అస్వస్థతకు గురైన విషయం తెలిసిన వెంటనే మూడు రోజులుగా వైద్యశాఖ ఆధ్వర్యంలో మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నట్లు చెప్పారు. వారి ఆరోగ్యం పట్ల ఎవ్వరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. 61 మంది చికిత్సల అనంతరం తమ ఇళ్లకు వెళ్లినట్లు తెలిపారు. కుడుపునొప్పి సమస్యలున్న మరో 12 మందికి మెరుగైన వైద్య చికిత్సలు అందిస్తున్నట్లు తెలిపారు. మిగతా విద్యార్థినులంతా కోలుకున్నట్లు తెలిపారు. పాఠశాలలో స్వచ్ఛమైన తాగునీరు, మరుగుదొడ్లు, పరిసరాలపరిశుభ్రత పట్ల మున్సిపల్, వైద్యశాఖల ఆధ్వర్యంలో తక్షణ చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.ప్రస్తుతం విద్యార్థినులందరి ఆరోగ్యం నిలకడగా ఉందన్నారు.

అయోధ్యకు తరలిన రామభక్తులు



పరిగి: అయోధ్యకు వెళ్తున్న భక్తులు

పరిగి, ఫిబ్రవరి 11: పరిగి నుంచి ఆదివారం అయోధ్యకు రామభక్తులు పెద్దసంఖ్యలో తరలి వెళ్లారు. పరిగి నియోజకవర్గం నుంచి దాదాపు 250మంది భక్తులు రైలులో అయోధ్యకు వెళ్లారు. భక్తుల సౌకర్యార్థం పరిగి నుంచి సికింద్రాబాద్ వరకు పరిగి ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు.

కులకచర్ల: కులకచర్ల నుంచి అయోధ్యకు ఆదివారం బీజేపీ నాయకులు బయలుదేరి వెళ్లారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు ప్రహ్లాద్‌రావు ఆధ్వర్యంలో పలువురు బీజేపీ నాయకులు అయోధ్యలో బాల రాముడిని దర్శనార్థం తరలివెళ్లారు. అయోధ్యకు విడతల వారీగా బీజేపీ శ్రేణులు వెళ్తున్నారని ప్రహ్లాద్‌రావు తెలిపారు. అయోధ్యకు వెళ్లిన వారిలో బీజేపీ మండల అధ్యక్షుడు షైపాల్, బీసీ మోర్చా నాయకులు వెంకటేశ్ ఉన్నారు.



కులకచర్ల: అయోధ్యకు వెళ్తున్న బీజేపీ నాయకులు

జిల్లా వాసులకు జాతీయ అవార్డులు

వికారాబాద్, ఫిబ్రవరి 11: సంతు శ్రీ సేవలాల్ మహారాజ్ జాతీయ అవార్డును వికారాబాద్ మండలం కోటాల గూడ గ్రామానికి చెందిన అఖిల భారత గిరిజన సమాఖ్య అధ్యక్షుడు రాఘవన్ నాయక్ అందుకున్నారు. తిరుపతిలో బహుజన సాహిత్య అకాడమి నేషనల్ ప్రెసిడెంట్ నల్ల రాధాకృష్ణ, కర్ణాటక ప్రొఫెసర్ రచయిత్రి వెంకమ్మ చేతుల మీదుగా ఆదివారం అవార్డును అందుకున్నారు. అదేవిధంగా జిల్లాకు చెందిన నవాబుపేట ఎంఈవో గోపాల్, టీచర్ స్వరూప విద్యారత్న అవార్డులను పొందారు. ఈ కార్యక్రమంలో మిత్రులు పెండ్యాల అనంతయ్య, ఉద్యమ నాయకులు ఆర్జే నాయక్, కళాకారుడు టేకు పెంటన్న పాల్గొన్నారు.



సంతు శ్రీ సేవాలాల్ అవార్డును అందుకుంటున్న రాఘవన్ నాయక్

కొత్తగడి రెసిడెన్షియల్ స్కూల్‌ను సందర్శించిన ప్రజాప్రతినిధులు

వికారాబాద్, ఫిబ్రవరి 11: కొత్తగడి రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థులు అస్వస్థతకు గురైనట్లు తెలుసుకున్న వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి వెళ్లి ఈ ఘటనకు సంబంధించిన వివరాలపై ఆరాతీశారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై పాఠశాల ప్రిన్సిపాల్ అపర్ణను అడిగి తెలుసుకున్నారు. ఎంతమంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారనే వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారి వెంట స్థానిక కౌన్సిలర్ వేణు, మురళి, నాయకులు కిషన్‌నాయక్, అనంత్‌రెడ్డి, కిందొడ్డి అంజయ్య పాల్గొన్నారు.



ప్రిన్సిపాల్‌తో మాట్లాడుతున్న ప్రజా ప్రతినిధులు

'ఎన్నికలపై ఉన్న శ్రద్ధ విద్యార్థుల భవిష్యత్తుపై లేదు'

ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు ఎలక్షన్ మీద ఉన్న శ్రద్ధ విద్యార్థుల భవిష్యత్తుపై ఎందుకు చూపించడం లేదని పీవోడబ్ల్యూజిల్లా కార్యదర్శి వై.గీత ప్రశ్నించారు. కొత్తగడి బాలికల రెసిడెన్షియల్ వసతి గృహంలో తరుచూ జరుగుతున్న ఘటనలపట్ల ఉన్నతాధికారులు స్పందించడంలేదన్నారు. పది సంవత్సరాలుగా బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యార్థిసంఘాలను, మీడియాను అనుమతించకపోవడం వల్లే ఇలాంటి పరిస్థితులు నెలకొన్నాయన్నారు. గతంలో ఓబాలిక మరణిస్తే అనారోగ్య సమస్యలు అని చెప్పి తప్పించుకున్నారని గుర్తుచేశారు. పరీక్షల సమయంలో విద్యార్థుల అనారోగ్యం పాలవుతుంటే వారి భవిష్యత్తు ఏమవుతుందో ఆలోచించాలన్నారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి వసతి గృహంలో తనిఖీ చేయాలని ప్రిన్సిపాల్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే పీవోడబ్ల్యూ ఆధ్వర్యంలో ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.

ఆలయ పునర్నిర్మాణానికి పూజలు



ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న గ్రామస్తులు


తాండూరురూరల్, ఫిబ్రవరి 11: మండలంలోని అంతారంలో ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని ఆంజనేయస్వామి ఆలయ పునర్నిర్మాణానికి గ్రామస్తులు ముందుకొచ్చారు. ఈ సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ఆంజనేయస్వామికి అభిషేకం, పూజలు, గోమత పూజ, భక్తులకు తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలు చేపట్టారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి, నాయకులు సంతప్‌కుమార్, మాజీ చైర్మన్ లక్ష్మారెడ్డి, భూకైలాస్ వ్యవస్థాపకులు వాసుపవార్ తదితరులను కలిసి ఆలయ అభివృద్ధికి సహకరించి తమవంతు సహాయ సహకారాలు అందించాలని కోరతామని గ్రామస్తులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు వడ్డె చంద్రయ్య, తాండూరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వడ్డె శ్రీనివాస్, మాజీ సర్పంచ్ వడ్డె శేఖర్, ఎంపీటీసీ శాంతు పాల్గొన్నారు.


గృహజ్యోతికి లబ్ధిదారుల వివరాల సేకరణ

బొంరాస్‌పేట్, ఫిబ్రవరి 11: ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాల్లో భాగంగా గృహజ్యోతి పథకానికి లబ్ధిదారుల నుంచి విద్యుత్ సిబ్బంది వివరాలను సేకరిస్తున్నారు. బొంరాస్‌పేట్ మండల కేంద్రంలో ఆదివారం విద్యుత్ సిబ్బంది 200 యూనిట్ల ఉచిత విద్యుత్ కోసం లబ్ధిదారుల వివరాలను సేకరించారు. విద్యుత్ మీటర్, రేషన్ కార్డు, ఆధార్ కార్డు నెంబరులు, ప్రజాపాలనలో అందించిన దరఖాస్తుల రశీదులు, ఫోన్ నెంబర్లను లబ్ధిదారులతో అడిగి తెలుసుకున్నారు.
















దీన్‌దయాళ్ ఉపాధ్యాయకు ఘన నివాళి


నివాళులర్పిస్తున్న హైమారెడ్డి

శామీర్‌పేట, ఫిబ్రవరి 11 : పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ సేవలు చిరస్మరణీయమని బీజేపీ మేడ్చల్ రూరల్ జిల్లా కార్యదర్శి ఎస్. హైమారెడ్డి అన్నారు. దీన్‌దయాళ్ ఉపాధ్యాయ సమర్పణ దివస్ (వర్ధంతి) సందర్భంగా ఆదివారం తూంకుంట మున్సిపల్ పరిధిలోని హకీంపేటలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దీన్‌దయాళ్ జాతీయవాది, హిందూ రాష్ట్ర సిద్ధాంతకర్త అని అన్నారు. భారతీయ జనసంఘ్ పూర్వ నాయకుడని చెప్పారు. దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. నాయకులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా ప్రభుత్వ భవనాలు

● రూ. కోట్ల ప్రజాధనం వృథా

● వినియోగించుకోవడంలో అధికారుల వైఫల్యం

యాచారం, ఫిబ్రవరి 11 : మండలంలో కోట్ల రూపాయల ప్రజాధనంతో వివిధ కార్యాలయాల కోసం నిర్మించిన పలు ప్రభుత్వ భవనాలు నిరుపయోగంగా ఉండడం వల్ల అవి శిథిలావస్థకు చేరుతున్నాయి. ప్రజల అవసరాల కోసం నిర్మించిన భవనాలు వృథాగా ఉండడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే ఉన్న పలు భవనాలు శిథిలావస్థకు చేరగా వాటి స్థానంలో కొత్తవి నిర్మించాలని, నిర్మాణంలో ఉండి వివిధ కారణాలతో నిలిచిపోయిన వాటిని పూర్తి చేసి ఉపయోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

నిర్మాణం పూర్తయినా ప్రారంభానికి నోచుకోక..

గృహ నిర్మాణ శాఖ అధికారులు మండల కేంద్రంలో 7 ఏళ్ల క్రితం రూ. 10లక్షల నిధులతో హౌజింగ్ ఏఈ కార్యాలయం కోసం భవనాన్ని నిర్మించగా.. నాటి ప్రభుత్వం గృహనిర్మాణశాఖను రద్దు చేయడంతో అప్పటి నుంచి అది నిరుపయోగంగానే ఉంది. దాన్ని ఇరిగేషన్ శాఖ కార్యాలయంగా ఉపయోగించుకోవాలని అధికారులు నిర్ణయించినప్పటికీ మూత్రశాల, మరుగుదొడ్డి వసతి లేని కారణంగా వృథాగానే ఉంది. రూ. 20లక్షల నిధులతో 8 ఏళ్ల క్రితం మండల అతిథిగృహ నిర్మాణం చేపట్టారు. దాన్ని ప్రారంభించకపోవడంతో పిచ్చుకలకు స్థావరంగా మారి, ఫర్నీచర్‌పై దుమ్మూధూళీ పడి పాడవుతోంది. మరో రూ. లక్షన్నర వెచ్చిస్తే అది వినియోగంలోకి వస్తుందని పంచాయతీరాజ్‌శాఖ అధికారులు చెప్పారు. మండల సమావేశ మందిరంతో పాటు దుకాణసముదాయం నిర్మించడం కోసం 8ఏళ్ల క్రితం రూ. 10లక్షల నిధులతో పనులు చేపట్టారు. నిధులు లేకపోవడంతో స్లాబ్ దశలోనే అవి ఆగిపోయాయి. మరో రూ. 20లక్షల నిధులు కేటాయిస్తేనే అవి అందుబాటులోకి వస్తాయని అధికారులు చెబుతున్నారు. 18 ఏళ్ల క్రితం నిర్మించిన ఇందిరా క్రాంతిపథకం కార్యాలయం మూడేళ్లుగా ఉపయోగంలో లేదు.


అసంపూర్తిగా ఉన్న సమావేశ మందిరం

యాచారం, మేడిపల్లి, చౌదర్‌పల్లి, మాల్ గ్రామాలలో రైతువేదికలున్నాయి. కానీ యాచారం మినహా మిగతావి నిరుపయోగంగా ఉన్నాయి. వీటి వల్ల 18ఏళ్ల క్రితం రూ.25లక్షలతో నిర్మించిన వ్యవసాయశాఖ భవనం నిరుపయోగంగా మారి అందులో అసాంఘీక కార్యకలాపాలు జరుగుతున్నట్లు స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

శిథిలావస్థకు చేరి..

ప్రభుత్వాసుపత్రి భవనం 50ఏళ్ల క్రితం నాటిది. వర్షాకాలంలో రోగులు, వైద్యులు ప్రాణాలు అర చేతిలో పెట్టుకొని కాలం గడుపుతున్నారు. దాన్ని కూల్చి కొత్త భవనం నిర్మించాలని మండల వాసులు కోరుతున్నా పట్టించుకునే నాథుడే లేడు. 1984లో రూ. 15లక్షల నిధులతో నిర్మించిన ఎస్సీ దుకాణ సముదాయం వృథాగా ఉండడంతో పాటు శిథిలావస్థకు చేరింది. ఎస్సీ నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించడం కోసం నాటి ప్రభుత్వం దీన్ని నిర్మించింది. మేడిపల్లిలోని పశువుల ఆసుపత్రి భవనాన్ని 25 ఏళ్లక్రితం రూ. 20లక్షల వ్యయంతో నిర్మించగా శిథిలావస్థకు చేరింది. ఈ గ్రామంలోనే బీసీ బాలుర వసతి గృహాన్ని గత ప్రభుత్వ హయాంలో రూ.45 లక్షల నిధులతో నిర్మించగా అది వృథాగా ఉంది. మండల కేంద్రంలో ఉన్నత పాఠశాల ఆవరణలో 8 తరగతి గదులు శిథిలావస్థకు చేరాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆరు గదుల నిర్మాణం కోసం స్లాబ్ వేసి అధికారులు చేతులు దులుపుకున్నారు. అవి పూర్తికావాలంటే మరో రూ.30లక్షల నిధులు కావాలని తెలిసింది. చౌదర్‌పల్లి గ్రామంలో గ్రామపంచాయతీ కార్యాలయాన్ని 45 ఏళ్ల క్రితం అంగన్‌వాడీ కేంద్రం కోసం నిర్మించిన పురాతన భవనంలో కొనసాగిస్తున్నారు. అది ఏ క్షణాన కూలుతుందో తెలియక బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. మాల్‌లో 26 ఏళ్ల క్రితం, నాటి సర్పంచులు జంగారెడ్డి, రబ్బానీ తమ స్వంత డబ్బుతో పాటు చందాలు వసూలు చేసి ఎకరంనర స్థలం కొని బస్టాండ్‌ను నిర్మించారు. ప్రస్తుతం అది వృథాగా ఉంది. 2013లో రూ.21లక్షలతో నిర్మించిన దుకాణాసముదాయం కూడా నిరుపయోగంగానే ఉంది. తాటిపర్తిలో 15 ఏళ్లుగా అంగన్‌వాడీ భవనం వృథాగానే ఉంది. అది శిథిలావస్థకు చేరడంతో పక్కనే ఉన్న ఓ ఇంట్లో అంగన్‌వాడీ కేంద్రం నడుస్తోంది. ఈ గ్రామంలోనే ఉన్న పశువుల ఆసుపత్రి భవనం శిథిలావస్థకు చేరింది. మరమ్మతులు చేపిస్తే అది అందుబాటులోకి వస్తుందని రైతులు చెప్పారు. ఇక్కడి స్మశాన వాటిక ముందే పాఠశాల ఉంది. విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు. పాఠశాలను మరో చోట నిర్మించడానికి పదేళ్ల క్రితం అధికారులు, ప్రజాప్రతినిధులు స్థల పరిశీలన చేసినా పనులు ముందుకు సాగలేదు. పలు తరగతి గదులు, వంటశాల శిథిలావస్థకు చేరడంతో వర్షం పడితే మధ్యాహ్న భోజనం వండే వారు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.


ప్రారంభానికి నోచుకోని అతిథి గృహం

భవనాలను పూర్తి చేయిస్తా



అసంపూర్తిగా ఉన్న భవనాలను పూర్తిచేయించడం కోసం జిల్లా పరిషత్ అధికారులు, కలెక్టర్‌తో మాట్లాడి నిధులు మంజూరు కోసం కృషి చేస్తా. ఎస్సీ దుకాణ సముదాయ షటర్లు పూర్తిగా శిథిలమయ్యాయి. వాటి స్థానంలో కొత్తవి నిర్మించడం కోసం నిధులు కేటాయించాలని ఎమ్మెల్యేను కోరుతా. నిర్మాణంలో ఆగిపోయిన వాటిని పూర్తి చేయిస్తా.

\- కొప్పు సుకన్యబాషా, ఎంపీపీ, యాచారం

పాఠశాలకు భవనాలు నిర్మించాలి



గ్రామంలోని పాఠశాల గదులన్నీ పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. మరో చోట కొత్తగా భవనాలు నిర్మించడం కోసం రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించాలి. పాఠశాల ముందే స్మశాన వాటిక ఉన్న కారణంగా ఒక్కోసారి వాసన భరించలేక విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించాలి.

\- దూస రమేష్, మాజీ సర్పంచ్ తాటిపర్తి

కొడంగల్‌కు నిధుల వరద

● మెడికల్ కళాశాలకు రూ.124.50 కోట్లు

● నర్సింగ్ కళాశాలకు రూ.46 కోట్లు

● ఫిజియోథెరపి, పారామెడికల్ కళాశాలలకు రూ.27 కోట్లు

● మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ పరిధిలోకి సీహెచ్‌సీని తీసుకు వస్తూ ఉత్తర్వులు

● దౌల్తాబాద్, బొంరాస్‌పేట్లో జూనియర్ కళాశాలలు

వికారాబాద్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ముఖ్యమంత్రి .రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజక వర్గానికి భారీగా నిధుల వరద ప్రవహిస్తోంది. ప్రభుత్వ మెడికల్ కళాశాల, నర్సింగ్, ఫిజియోథెరపి, పారామెడికల్ అండ్ అల్లైడ్ హెల్త్ సైన్సెస్ కళాశాలల ఏర్పాటుతో పాటు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ అప్‌గ్రేడేషన్ కోసం రూ.224.50 కోట్లు మంజూరు చేస్తూ పరిపాలనా పరమైన అనుమతులు జారీ చేసింది. కొడంగల్‌లో ప్రభుత్వ మెడికల్ కళాశాల ఏర్పాటు చేసేందుకు రూ.124.50 కోట్లు మంజూరు చేయగా, ప్రభుత్వ నర్సింగ్ కళాశాలకు రూ.46 కోట్లు, ప్రభుత్వ ఫిజియోథెరపి, పారా మెడికల్ కళాశాలకు రూ.27 కోట్లు, 50 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను 220 పడకలతో టీచింగ్ హాస్పిటల్‌గా స్థాయి పెంపొందించేందుకు రూ.27 కోట్లు మంజూరు చేస్తూ ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జడ్ చొంగ్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మెడికల్ కళాశాలలో ప్రతిఏటా 50 సీట్లను పెంచనున్నారు. నర్సింగ్ కళాశాలలో ప్రతిఏటా 60, ఫిజియోథెరపి కళాశాలలో 50, పారామెడికల్ అండ్ అల్లైడ్ హెల్త్ సైన్సెస్ కళాశాలలో 30 సీట్లు పెరగనున్నాయి. కొడంగల్‌లో ఏర్పాటు చేయనున్న ప్రభుత్వ మెడికల్ కళాశాలకు అనుబంధంగా సీహెచ్‌సీని 220 పడకలతో టీచింగ్ ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయబోతున్నారు. తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ ఆధీనంలో ఉన్న సీహెచ్‌సీని మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ పరిధిలోకి తీసుకువస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ మెడికల్ కళాశాల, నర్సింగ్, ఫిజియోథెరపి, పారామెడికల్ అండ్ అల్లైడ్ హెల్త్ సైన్సెస్ కళాశాలల భవనాల నిర్మాణం పనులను ఆర్అండ్‌బీ శాఖ చేపట్టనుండగా, సీహెచ్‌సీని టీచింగ్ హాస్పిటల్‌గా అప్‌గ్రేడ్ చేసే పనులను టీఎస్ఎంఎస్ఐడీసీ చేపట్టనుంది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి కొడంగల్‌లో ప్రభుత్వ మెడికల్ కళాశాలతో పాటు నర్సింగ్, ఫిజియోథెరపి, పారామెడికల్ అండ్ అల్లైడ్ హెల్త్ సైన్సెస్ కళాశాలలు ప్రారంభమయ్యేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

కొడంగల్ నియోజకవర్గంలో ఈ గతేడాది ప్రారంభమైన దౌల్తాబాద్, కొత్తగా మంజూరైన బొంరాస్‌పేట జూనియర్ కళాశాలలకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. బొంరాస్‌పేట, దౌల్తాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు రూ.7.13 కోట్లు మంజూరు చేయగా, ఒక్కో కళాశాల భవన నిర్మాణానికి రూ.4.79 కోట్లు, రూ.2.34 కోట్లు కేటాయించింది. ఈ కళాశాలల భవన నిర్మాణం కోసం అనువైన చోట స్థల సేకరణ చేపట్టాలని విద్యా శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం జిల్లా కలెక్టర్‌కు సూచించారు.

నిలిపి ఉన్న కారును ఢీకొన్న మరో కారు

● రెండు కార్లూ బోల్తా.. ● నలుగురికి గాయాలు

● శంషాబాద్ ఎయిర్‌పోర్టు వద్ద ఘటన

శంషాబాద్, ఫిబ్రవరి 11 : రంగారెడ్డి జిల్లా శంషాబాద్ విమానాశ్రయ సమీపంలో రోడ్డు పక్కన నిలిపి ఉన్న ఓ కారును వెనక నుంచి వచ్చిన మరో కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో రెండు కార్లూ బోల్తాకొట్టాయి. దీంతో నలుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటన ఆదివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం రామలచ్చక్కపేటకు చెందిన రాజు తన కారులో ఎయిర్‌పోర్టుకు వచ్చాడు. ఎయిర్‌పోర్టుకు సమీపంలో రోడ్డు పక్కన తన కారును నిలిపాడు. ఇంతలో వెనుకనుంచి వేగంగా వచ్చిన కారు అదుపుతప్పి రాజు కారును ఢీకొంది. దీంతో రెండు కార్లు బోల్తా కొట్టాయి. రాజు, నిలిపి ఉన్న కారులోని మరో ముగ్గురు స్వల్పంగా గాయపడ్డారు. క్షతగాత్రులను శంషాబాద్‌లోని ఆస్పత్రికి తరలించారు.


ప్రమాదంలో బోల్తా పడ్డ కారు

'బీసీలపై కవితది కపట ప్రేమ'

తాండూరు, ఫిబ్రవరి 11: బీసీలపై ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కపట ప్రేమ చూపుతున్నారని బీసీ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు రాజ్‌కుమార్ విమర్శించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తొమ్మిది సంవత్సరాలు అధికారంలో ఉన్నప్పుడు గుర్తుకురాని బీసీలు ఇప్పుడెందుకు గుర్తుకొచ్చారని ఎద్దేవా చేశారు. అప్పుడు అసెంబ్లీలో పూలే విగ్రహాన్ని ఎందుకు ఏర్పాటు చేయలేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయాంలో బీసీల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించలేదన్నారు. బీసీల గళాన్ని విడిపించేందుకు ఆందోళనలు చేపడితే తమ హక్కులకు భంగం కలిగించారని చెప్పారు. ప్రజల హక్కులకు భంగం కలిగించిన ధర్నా చౌక్‌లో నేడు (12న) ఆమె బీసీల ధర్నా చేస్తాననడం విడ్డూరమని అన్నారు. రాజ్యాధికారం కోసం ఆర్ కృష్ణయ్య నేతృత్వంలో తాము పోరాడుతామని చెప్పారు. ఈ ధర్నాని తాము బహిష్కరిస్తున్నామని తెలిపారు.

ఉమ్రా యాత్రికులకు ఘనస్వాగతం


యాత్రికులకు స్వాగతం పలుకుతున్న కుటుంబసభ్యులు

శంషాబాద్, ఫిబ్రవరి 11 : ఉమ్రాయాత్ర ముగించుకొని స్వదేశానికి తిరిగి వచ్చిన యాత్రికులకు శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆదివారం వారి కుటుంబ సభ్యులు పూలమాలలు వేసి ఘనంగా స్వాగతం పలికారు. తమ యాత్ర 13 రోజుల పాటు విజయవంతంగా జరిగిందని పలు పుణ్య స్థలాలను దర్శించుకున్నామని ఉమ్రా యాత్ర కన్వీనర్ మహ్మద్ ఫయాజ్ అలీ తెలిపారు.

కరాటేతో విద్యార్థులకు ఆత్మరక్షణ


విద్యార్థులకు సర్టిఫికెట్‌లు అందిస్తున్న కృష్ణంరాజు

కొడంగల్, ఫిబ్రవరి 11 : కరాటే శిక్షణ విద్యార్థుల ఆత్మరక్షణకు ఎంతో దోహదపడుతుందని యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణంరాజు అన్నారు. సన్ బుడోకాన్ కరాటే శిక్షణ పొందిన 40 మంది విద్యార్థులకు ఆదివారం స్థానిక జడ్పీ హైస్కూల్ ఆవరణలో సర్టిఫికేట్‌లు అందించారు. విద్యార్థులకు చదువుతో పాటు ఆపద సమయాల్లో తమను తాము రక్షించుకునేందుకు కరాటే లాంటి సెల్ఫ్‌డిఫెన్స్ శిక్షణ ఎంతో దోహదపడుతుందన్నారు. కరాటే మాస్టర్ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కార్డులను సద్వినియోగం చేసుకోవాలి

● జన్ సాహస్ మండల కో ఆర్డినేటర్ రవీందర్


లేబర్ కార్డులను పంపిణీ చేస్తున్న జన్ సాహస్ ప్రతినిధులు

కులకచర్ల, ఫిబ్రవరి 11 : లేబర్ కార్డులను కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని జన్‌సాహస్ మండల కో ఆర్డినేటర్ రవీందర్ అన్నారు. ఆదివారం కులకచర్లలోని బస్టాండ్ దగ్గర జన్ సాహస్ స్వచ్ఛంద సంస్థ, సీఎస్‌సీ లేబర్ శాఖ వారి సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ రంగంలో పని చేస్తున్న కార్మికులందరూ లేబర్ కార్డులను పొంది ఇన్సూరెన్స్, వైద్య పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. లేబర్ కార్డు ఉన్న వారికి ప్రభుత్వం 50 రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తారని చెప్పారు. లేబర్ కార్డు కలిగిన కార్మికుడి ఇంట్లో కూతుళ్లు ఉంటే వారి పెళ్లిలకు ఒక్కొక్కరికి రూ.30వేల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తారని అన్నారు. కార్మికులు ప్రమాదవశాత్తు చనిపోతే రూ.6 లక్షల 30వేలు, సహజ మరణానికి రూ.1 లక్ష 30వేలు, ప్రమాదంలో అంగవైకల్యం చెందితే రూ.5లక్షలు కార్మిక శాఖ ఆర్థిక సహాయం అందిస్తుందన్నారు. రజక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మోత్కుర్ వెంకటేశ్, హెల్త్ క్యాంపు కో ఆర్డినేటర్ విష్ణువర్ధన్, వెంకటేశ్, శిరీష, నరేందర్, నరేశ్, జయసుధ, అనిల్, రాజేశ్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వాసవీ మాతకు పూజలు

ఆమనగల్లు, ఫిబ్రవరి 11 : పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో ఆదివారం వాసవి మాత ఆత్మార్పణ దినోత్సవం వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి దేవాలయాన్ని పచ్చతోరణాలు, పూలతో శోభాయామానంగా అలంకరించారు. ఆర్యవైశ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రామ్మోహన్ ఆధ్వర్యంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు పూజలు నిర్వహించారు. ఆమనగల్లుతో పాటు సమీప గ్రామాల నుంచి భక్తులు, ఆర్యవైశ్య సంఘం నాయకులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. వాసవి నామ స్మరణతో ఆలయం మార్మోగింది. ఉదయం సుప్రభాత సేవతో అమ్మవారికి మేల్కొలుపు పాడారు. అనంతరం వాసవి మాత మూలవిరాట్‌ను పట్టు వస్త్రాలతో అలంకరించి అర్చకుడు శ్రీనయ్య, దినేశ్ ఆధ్వర్యంలో అభిషేకం, సామూహిక కుంకుమార్చన, అమ్మవారి యజ్ఞాన్ని ఘనంగా నిర్వహించారు. పూజల అనంతరం భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు సమర్పించుకున్నారు. ఆలయ కోశాధికారి బికుమళ్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి బికుమళ్ల నర్సింహ, నాయకులు మాండెం చంద్రశేఖర్, నీలం యాదయ్య, కుమార స్వామి, దొంతు సత్యనారాయణ, నర్సింహ్మ, విజయ్, జగన్, వాస శ్రీనివాస్, రవీంద్రానంద్, ఆకుతోట శ్రీనివాస్, దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.


ఆమనగల్లు : హోమం నిర్వహిస్తున్న మహిళలు

యాచారం : యాచారం మండల కేంద్రంలో ఆదివారం ఆర్యవైష్య సంఘ నాయకులు వాసవి కన్యకాపరమేశ్వరీ అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. పలువురు నాయకులు అమ్మవారికి పూజలు చేశారు. ఆ సంఘ నాయకులు మాట్లాడుతూ కన్యకాపరమేశ్వరీ మార్గంలో ముందుకు సాగుతామని అన్నారు. మండల ఆర్యవైష్య సంఘ నాయకులు వి. సంతోష్, నరేష్, సురేందర్, శివశంకర్, వెంకటరత్నం, ప్రవీణ్, కిరణ్, విజేందర్ ఉన్నారు.


యాచారం : పూజలు చేస్తున్న ఆర్యవైష్య సంఘం నాయకులు

పరిగి సీఐ, ఎస్‌ఐలకు సన్మానం



పరిగికి కొత్తగా వచ్చిన సీఐ, ఎస్‌ఐలను సన్మానిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి, ఫిబ్రవరి 11: పరిగి సిఐగా ఎస్ శ్రీనివాస్, ఎస్ఐగా సంతోష్‌కుమార్‌లు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. పరిగి సిఐగా పని చేస్తున్న వెంకటరామయ్య బదిలీపై సంతోషనగర్‌కు వెళ్లారు. గద్వాల్ సీఐగా పని చేస్తున్న ఎస్ శ్రీనివాస్ పరిగికి వచ్చారు. ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్ఐగా పని చేస్తున్న సత్యనారారణ బదిలీపై వికారాబాద్‌కు వెళ్లారు. ధారూర్ ఎస్ఐగా పని చేస్తున్న సంతోష్‌కుమార్ పరిగి ఎస్ఐగా వచ్చారు. ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. కొత్తగా వచ్చిన సీఐ, ఎస్‌ఐలను పరిగి మండల పార్టీ అధ్యక్షుడు పరుశరాంరెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డి నివాసంలో ఘనంగా సన్మానించారు.

గతంలో మంజూరైన పనులను పూర్తి చేయాలి

- బీఆర్ఎస్ పార్టీని వీడేది లేదు
- బీఆర్ఎస్ కార్యకర్తలపై కక్షసాధింపు తగదు
- మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

కొడంగల్, ఫిబ్రవరి 11: బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో మంజూరైన పనులను కొనసాగిస్తూ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మరిన్ని నిధులను మంజూరు చేసిఅభివృద్ధి చేయా లని మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. ఆయన ఆదివారం నియోజకవర్గంలో జరిగిన పలు వివాహాది కార్యక్రమాల్లో పాల్గొని కొడంగల్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కొడంగల్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన రేవంత్‌రెడ్డి సీఎం కావడంతో మరిన్ని నిధులను మంజూరు చేసి అభివృద్ధి చేయాలన్నారు. గతంలో మంజూరైన నిధులను రద్దుచేయడం సరికాదన్నారు. తన సోదరుడు పట్నం మహేందర్‌రెడ్డి దంపతులు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారనే వార్తల నేపథ్యంలో అది వారి వ్యక్తిగతమని తెలిపారు. తాను మాత్రం సీఎం కేసీఆర్ నాయకత్వంలోనే పనిచేస్తానని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో గిరిజన తండాలు, గ్రామాల అభివృద్ధి ఇతరాత్రా వాటి కోసం కోట్లాది రూపాయలు మంజూరు చేయించామని తెలిపారు. పనులు పూర్తయిన వాటికి నిధులు మంజూరు చేయాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సర్పంచ్‌లు, నాయకులు చేపట్టిన పనులకు బిల్లులు చేయకుండా సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇవ్వడం సరికాదన్నారు. గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు పార్టీలకతీతంగా పని చేశామే తప్ప కక్షసాధింపు చర్యలకు పాల్పడలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం బీఆర్ఎస్ హయాంలో జరిగిన పనులకు బిల్లులు పెండింగ్‌లో పెట్టకుండా వెంటనే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. లేదంటే బీఆర్ఎస్ తరపున దశల వారీగా ఆందోళనలు చేస్తామని హెచ్చ రించారు. అనంతరం పార్టీ నాయకులతో కలిసి ఈ నెల 13వ తేదీన నల్గొండలో కృష్ణానది జలాలలో తెలంగాణ హక్కుల పరిరక్షణ కోసం చేపట్టే బహిరంగసభను జయప్రదం చేయాలని కోరుతూ పోస్టర్‌ను ఆవిష్క రించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు మధుసూదన్ యాదవ్, కోట్ల మహిపాల్, విష్ణువర్ధన్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, రమేశ్‌బాబు, డాక్టర్ నవాజ్ పాల్గొన్నారు.

వివాహ వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే

కొడంగల్ నియోజకవర్గ పరిధిలోని బొంరాస్‌పేట్ మండలం సాలింపూర్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకులు హన్మంత్‌నాయక్ కుమారుడు నెహ్రూనాయక్ వివాహానికి కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి హాజరయ్యారు. ఆదివారం మొయినాబాద్ లోని పీవీ కన్వెషన్‌హాల్‌లో జరిగిన వివాహాది వేడుకలో మాజీ ఎమ్మెల్యేతో పాటు బీఆర్ఎస్ నాయకులు పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం



బషీరాబాద్: ట్రోఫీ అందజేస్తున్న ఎమ్మెల్యే

బషీరాబాద్, ఫిబ్రవరి 11 : క్రీడల్లో గెలుపోటములు సహజమని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. మండలంలోని బాబునాయక్‌తండాలో బీఎంఆర్ క్రికెట్ ప్రీమియర్ లీగ్ టోర్నమెంట్‌లో గెలుపొందిన జట్టుకు ఆదివారం ట్రోఫీ అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడలతో యువతలో స్నేహ భావం పెంపొందుతుందన్నారు. ఈకార్యక్రమంలో జడ్పీటీసీ మిర్యాణం శ్రీనివాస్‌రెడ్డి, నవాంద్గి పీఏసీఎస్ వైస్ చైర్మన్ అజయ్‌ప్రసాద్, కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి జి.మాధవరెడ్డి, రామునాయక్, శంకరప్ప పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

పూడూరు: రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు మండల విద్యార్థులు ఎంపికయ్యారు. ఆదివారం జిల్లాలో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో పూడూరు మండలంలోని పెద్ద ఉమ్మెంతల్‌కు చెందిన చందన, శృతి, సుస్మిత, తలసిలు జిల్లా స్థాయికి నుంచి రాష్ట్రకి ఎంపికయ్యారు. ఈ కబడ్డీ పోటీలు జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రెసిడెంట్ పరుశురాం, జనరల్ సెక్రెటరీ వినోద్‌కుమార్, ఉమ్మెంతల్ స్కూల్ పీఈటీ తిరుమలయ్య ఆధ్వర్యంలో జరిగాయి.



పూడూరు: రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన పెద్ద ఉమ్మెంతల్ విద్యార్థులు

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష



ప్రవేశపరీక్షకు హాజరై వెళ్తున్న విద్యార్థులు

కొడంగల్ రూరల్, ఫిబ్రవరి 11: గురుకుల పాఠశాలల్లో 5వ తరగతి ప్రవేశాల కోసం నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా కొనసాగినట్లు ప్రిన్సిపాల్‌లు శంకర్‌బాబు, బల్‌రాంనాయక్ తెలిపారు. కొడంగల్ పట్టణంలోని మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాల, పాత కొడంగల్‌లోని ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో ఆదివారం 5వ తరగతి ప్రవేశాల కోసం నిర్వహించిన ప్రవేశపరీక్షకు జ్యోతిరావుపూలే గురుకుల పాఠశాలలో 240మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 227మంది హాజరై పరీక్ష రాశారు. పాతకొడంగల్ ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలలో 408మంది పరీక్ష రాయాల్సిఉండగా 390మంది హాజరై పరీక్ష రాసినట్లు ప్రిన్సిపాల్‌లు తెలిపారు.

మాజీ కౌన్సిలర్ లక్ష్మణ్ మృతి

తాండూరు, ఫిబ్రవరి 11: తాండూరు మున్సిపల్ మాజీ కౌన్సిలర్ లక్ష్మణ్ ఆదివారం రాత్రి తన ఇంట్లో తీవ్ర అస్వస్థతకు గురై ఆసుపత్రికి తరలిస్తుండగా మృతిచెందారు. తాండూరు మున్సిపల్ చైర్మన్ విశ్వనాథ్‌గౌడ్ కొనసాగుతున్న సమయంలో లక్ష్మణ్ కౌన్సిలర్‌గా ఉన్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులుగా బోయ సంఘం నాయకులుగా లక్ష్మణ్ పనిచేశారు. లక్ష్మణ్ అంత్యక్రియలు ఆదివారం తాండూరు పట్టణంలో నిర్వహించారు. పలువురు కాంగ్రెస్ నాయకులు ఆయన మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు.

బీజేపీ జిల్లా కార్యవర్గంలో బీసీలకు పెద్దపీట వేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

తాండూరు, ఫిబ్రవరి 11: బీజేపీ జిల్లా కార్యవర్గంలో బీసీలకు పెద్దపీట వేయాలని బీజేపీ నాయకులు కోరారు. తాండూరులో బీజేపీ సీనియర్ నాయకులు ఎం.నరేష్, జిల్లా ఉపాధ్యక్షుడు బాలి శివకుమార్, ప్రధాన కార్యదర్శి కృష్ణ ముదిరాజ్, కార్యదర్శి బంటారం భద్రేశ్వర్, పట్టణ అధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్ ఆదివారం విలేకరుల సమావేశంలోఓ మాట్లాడుతూ.. తాండూరుకు చెందిన ఎనిమిది మందికి జిల్లా కార్యవర్గంలో చోటు కల్పించాలని కోరారు. పార్టీ కోసం క్రమశిక్షణతో పనిచేసిన వారికి సామాన్య కార్యకర్తకు ఎప్పుడైనా గుర్తింపు ఉంటుందన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో పార్టీని గెలిపించి తిరిగి ప్రధాని మోడీని ప్రధానిని చేస్తామన్నారు. బీజేపీ రాష్ట్రంలో అధికారంలోకి వస్తే బీసీని ముఖ్యమంత్రి చేస్తామని ప్రకటించినట్లు గుర్తుచేశారు. బీజేపీ చేవెళ్ల ఎంపీ స్థానాన్ని బీసీలకు ఇవ్వాలన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో తాండూరు నుంచి బీసీ అభ్యర్థి లేకపోవడంతోనే గందరగోళానికి గురయ్యామని తెలిపారు. రాష్ట్రంలో పది పార్లమెంటు స్థానాలను బీజేపీ సాధిస్తుందని అన్నారు. కోడూరులో నేషనల్ హైవే అక్రమాలపై కేంద్రమంత్రి గడ్కరీకి మరోసారి ఫిర్యాదు చేస్తామని తెలిపారు. తాండూరు మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి అక్రమాలపై విచారణ జరపాలని తాజా మాజీ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి ఫిర్యాదు చేస్తామని చెప్పారు. కాంగ్రెస్‌లోకి మాజీ మంత్రి మహేందర్‌రెడ్డి రావడం వల్ల ప్రస్తుతం ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి డమ్మీగా మారే అవకాశం ఉందని విమర్శించారు. ఈ సమావేశంలో జిల్లా కిషన్ మోర్చా అధ్యక్షుడు సంజీవరెడ్డి, మైనార్టీ సెల్ అధ్యక్షుడు అబ్బాస్, బీజేపీ జిల్లా ఓబీసీ సెల్ అధ్యక్షుడు శ్రీహరి, అధికార ప్రతినిధి వెంకట్ పాల్గొన్నారు.

ఛత్రపతి శివాజీని ఆదర్శంగా తీసుకోవాలి

- మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి



శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న పైలట్ రోహిత్‌రెడ్డి

బషీరాబాద్, ఫిబ్రవరి 11: ఎందరో మహానుభావులకు స్ఫూర్తిదాయకంగా ఉన్న ఛత్రపతి శివాజీని అందరూ ఆదర్శంగా తీసుకోవాలని తాజామాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి అన్నారు. మండలంలోని నీళ్ళపల్లి, గొటిగఖుర్దు, కంసాన్‌పల్లి(ఎం) గ్రామాల్లో ఆదివారం ఛత్రపతి శివాజీ విగ్రహాలను ఆయన ఆవిష్కరించారు. ఈసందర్భంగా అయా గ్రామాల్లో ఛత్రపతి శివాజీ యొక్క గొప్పతనం, సమాజం కోసం చేసిన సేవలను వివరిస్తూ శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం విగ్రహాల దాత, మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ శివాజీ మహరాజ్ పరిపాలన విధానం, వ్యక్తిత్వం నేటితరం గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు ఇందర్‌చేడ్ నర్సింహారెడ్డి, నాయకులు బాన్సల్లి శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు విష్ణువర్ధన్‌రెడ్డి, సువర్ణ, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సాయి ధ్యాన మందిరం ఉత్సవాలు

పరిగి, ఫిబ్రవరి 11: పరిగిలోని షిర్డీ సాయిబాబా ధ్యాన మందిరం వార్షికోత్సవాలు ఆదివారం ముగిశాయి. చివరి రోజున ఆదివారం ఉదయం షిర్డీ సాయిబాబా వారికి కాకడ హారతి, సుప్రభాతం, 7గంటలకు బాబావారికి అభిషేకం, ఉచిత సామూహిక సాయివ్రతాలు జరుగుతాయి. బాబావారికి చందనోత్సవం, సాయిసేవకులతో సత్సంగ ప్రసంగ కార్యక్రమాలు జరిగాయి. షిర్డీసాయిబాబాకు హారతి, సాంస్కృతిక కార్యక్రమాలు, బాబా వారికి పుష్పాభిషేకం, శివపార్వతుల కల్యాణ ఉత్సవం వైభవంగా జరిగింది. ఈ ఉత్సవాల్లో పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కె.మహేశ్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎం.అశోక్ పాల్గొని పూజలు చేశారు.

అందరికా.. కొందరికా?

తాండూరు, ఫిబ్రవరి 11: రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేయబోతున్న 200 యూనిట్ల ఉచిత విద్యుత్ (గృహజ్యోతి)పై సర్వత్రా చర్చ జరుగుతోంది. రాష్ట్ర మంత్రివర్గం గృహజ్యోతి పథకం, రూ.500కే గ్యాస్‌సిలిండర్ పంపిణీ అమలుకు శ్రీకారం చుట్టాలని తీర్మానం చేసింది. దీంతో ప్రజల్లో ఆశలు చిగురిస్తున్నాయి. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ఆరు గ్యారెంటీ హామీలను ఇచ్చిన విషయం తెలిసిందే. అందులో భాగంగా పార్లమెంటు ఎన్నికలలోపు 'గృహజ్యోతి' పథకాన్ని అమలు చేయాలని రాష్ట్రప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈనెల 8 నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కాబోతున్నాయి. ఈసమావేశాల్లోనే వీటి అమలుకు ప్రకటన వెలువడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈపథకం అమలు కోసం నియమనిబంధనలు ఏంటి? తెల్లరేషన్‌కార్డు వారికే ఇస్తారా? అన్ని వర్గాలకు అమలు చేస్తారా? అని చర్చ జరుగుతోంది. జిల్లా వ్యాప్తంగా నాలుగు మునిసిపాలిటీలు, 566 గ్రామ పంచాయతీలున్నాయి. ఉచిత విద్యుత్‌కు ఎంత మంది అర్హులనే విషయంలో విద్యుత్‌శాఖ అధికారులు అంచనాలు సిద్ధం చేశారని తెలుస్తోంది. తాండూరు, వికారాబాద్, కొడంగల్, పరిగి నియోజకవర్గాలలో జనాభా 12.50 లక్షలు మొత్తం 3.58 లక్షల విద్యుత్ సర్వీసులు ఉన్నాయి. 200యూనిట్ల చొప్పున నెలకు రూ.20కోట్లపైనే విద్యుత్‌శాఖకు భారం పడుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈబీఎఫ్ డేటాబేస్‌ను చేపడుతున్నారు. ఈ నెల 15వరకు చేపట్టనున్నారని తాండూరు ఏడీ జయరాజు తెలిపారు.

మూడు విభాగాలుగా..

గృహజ్యోతి పథకాన్ని మూడు విభాగాలుగా విభజించబోతున్నట్లు తెలుస్తోంది. 1-50, 51-100, 101-200యూనిట్లు విద్యుత్ వాడే సర్వీసులను వేర్వేరుగా చేసి ఈ పథకం కిందకు తీసుకురానున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు. అందుకోసం సర్వీసులను గుర్తించినట్లు ఓ అధికారి తెలిపారు.

గిన్నిస్ రికార్డు సాధించడం అభినందనీయం



జయశ్రీని అభినందిస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

కీసర, ఫిబ్రవరి 11: జయశ్రీ గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డు సాధించడం అభినందనీయమని మేడ్చల్ నియోజకవర్గ ఎమ్మెల్యే చామాకూర మల్లారెడ్డి అన్నారు. ఇటీవల గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో భారత్ ఆర్ట్స్ అధ్వర్యంలో 7209 మంది నృత్యకారులు కూచిపూడి నాట్యం ప్రదర్శించారు. ఏకకాలంలో వేలమంది నృత్య ప్రదర్శించడంతో గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డు ఘనత సాధించడం జరిగింది. నాట్య ప్రదర్శనలో కీసర మండలం రాంపల్లి దాయరకు చెందిన కందాడి అంజిరెడ్డి, రమ్యల కూతురు జయశ్రీ పాల్గొన్నారు. నృత్య ప్రదర్శనలో పాల్గొన్న జయశ్రీ పెరిణిదేవి నాట్యాలయం దమ్మాయిగూడలో శిక్షణ తీసుకున్నారు. గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డు వారు పంపిన ధృవ పత్రంతో జయశ్రీ ఆదివారం స్థానిక ఎమ్మెల్యే మల్లారెడ్డిని మర్యాదపూర్వకంగా కలువగా, మల్లారెడ్డి జయశ్రీని అభినందించి, ఇలాంటి నృత్య ప్రదర్శనలు మరెన్నో చేసి, రాష్ట్రానికి మరింత పేరు, ప్రఖ్యాతలు తీసుకురావాలని తెలిపారు.

అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు



చౌదరిగూడలో అక్రమ నిర్మాణాలను కూల్చివేయిస్తున్న అధికారులు

ఘట్‌కేసర్, ఫిబ్రవరి 11: అనుమతి లేకుండా ఎలాంటి నిర్మాణాలు చేపట్టిన చర్యలు తప్పవని చౌదరిగూడ పంచాయతీ కార్యదర్శి శశికుమార్ హెచ్చరించారు. ఘట్‌కేసర్ మండలంలోని చౌదరిగూడ సర్వేనెంబర్ 869లో గల ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నట్లు జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు అందాయని తెలిపారు. ఈ మేరకు ఎక్స్‌కావేటర్‌తో ప్రభుత్వ భూమిలో నిర్మించిన రెండు ఇళ్లను కూల్చివేయించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమతి లేకుండా ఎలాంటి నిర్మాణాలు చేపట్టినా కఠినచర్యలు తప్పవన్నారు.

హైకోర్టును మేడిపల్లిలో నిర్మించాలి

ఘట్‌కేసర్, ఫిబ్రవరి 11: రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానానికి నారాపల్లిలోని వివాదాలులేని ప్రభుత్వ భూమిని కేటాయించాలని ప్రజాచైతన్య వేదిక కన్వీనర్, భువనగిరి మాజీ ఎమ్మెల్యే కొమ్మిడి నర్సింహరెడ్డి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. నారపల్లి, మేడిపల్లి, చెంగిచెర్ల రెవెన్యూ పరిధిలో 700ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నదని గుర్తు చేశారు. అనువైన భూమి ఉన్నప్పటికీ విశ్వవిద్యాలయాలకు చెందిన భూములెందుకని ప్రశ్నించారు. ఇందుకోసం ప్రభుత్వం జారీచేసిన 55జీవోను ఉపసంహరించుకోవాలన్నారు. హైకోర్టు నూతన భవనం నిర్మాణానికి రంగారెడ్డి జిల్లా బుద్వేల్, ప్రేమాతిపేట గ్రామాల పరిధిలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర విశ్వవిద్యాలయం, కొండాలక్ష్మణ్ తెలంగాణ స్టేట్ హార్టికల్చర్ విశ్వవిద్యాలయాల ఆధీనంలోని దాదాపు వంద ఎకరాల భూమిని కేటాయిస్తూ ప్రభుత్వం జీవో 55ను జారీ చేసినట్లు గుర్తుచేశారు. మేడిపల్లి నారపల్లి, చెంగిచెర్ల రెవెన్యూలోని 700ఎకరాల గుట్టలకంచె ఉన్నదని వివరించారు. ఈస్థలం వరంగల్-హైదరాబాద్ వరంగల్ జాతీయ రహదారికి, అవుటర్ రింగ్‌రోడ్డుకు దగ్గరగా ఉంటుందని గుర్తుచేశారు. ఇక్కడ హైకోర్టు నిర్మాణంతో పాటు న్యాయమూర్తుల నివాసాలకు స్థలం ఉంటుందని అన్నారు. ఈవిషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానన్నారు.

వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు

కొడంగల్, ఫిబ్రవరి 11: శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి మాత ఆత్మార్పణ దినాన్ని ఆదివారం స్థానిక నగరేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అభిషేకం, కుంకుమ అర్చనను సభాపతి విశ్వనాథశాస్త్రి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు శివకుమార్ గుప్త,ప్రవీణ్‌కుమార్, స్వప్న, రాఘవేందర్, రాము, సాయికిషోర్, కొత్త ఎల్లయ్య పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి



ఘట్‌కేసర్: అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

ఘట్‌కేసర్, ఫిబ్రవరి 11: అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతీఒక్కరు కృషి చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కమిటీసభ్యుడు సీహెచ్ గణేష్ అన్నారు. ఘట్‌కేసర్‌లో ప్రబుద్ధ భారత్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన అంబేద్కర్‌కు నివాళి కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎదులాబాద్ రోడ్డులో గల అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మీసాల అరుణ్‌కుమార్, దాసు నర్సింగరావు, బాలయ్య, రాజేష్, విష్ణు, కృష్ణంరాజు, సత్యం పాల్గొన్నారు.

ప్రతీఒక్కరు అంబేద్కర్‌ను స్మరించుకోవాలి

ఘట్‌కేసర్ రూరల్: ప్రతీఒక్కరు రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్‌ను స్మరించుకోవాలని ఎదులాబాద్ కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు సామల అమర్ అన్నారు. మండలంలోని ఎదులాబాద్ సౌత్ ఇండియా బ్యాంక్ చౌరస్తాలోని బీఆర్ అంబేద్కర్‌కు ఆదివారం 47వ జ్ఞానమాల సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ అంబేద్కర్‌ను ప్రతీఒక్కరు స్మరించుకొని ఆయన ఆశయసాధనకు కృషిచేయాలని కోరారు. ప్రతీఒక్కరు చదువుకొని సమాజంలో నెలకొన్న అసమానతలను రూపుమాపాలన్నారు. కులమతాలకు అతీతంగా అభివృద్ధి చెందినప్పుడే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో డైరెక్టర్ కొమ్మిరెడ్డి ఉదయ్‌కుమార్‌రెడ్డి, మండల కో-అప్షన్ సభ్యుడు ఎండీ ఇక్బాల్, కాంగ్రెస్ నాయకులు మెట్టు రమేష్, నర్సింహ, బింగి రాజేందర్‌గౌడ్, బస్వయ్య, బత్తిని ప్రవీణ్, అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు దుర్గేష్, మల్లేష్, అనిల్, శ్రీశైలం, శ్రీకాంత్, నాగరాజు, మురళిమోహన్, లింగం, మనోజ్‌కుమార్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.



ఘట్‌కేసర్ రూరల్: ఎదులాబాద్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

క్రైం కార్నర్

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృతి

నవాబుపేట, ఫిబ్రవరి 11: వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృతిచెందారు. ఈ ఘటనలు నవాబుపేట, కులకచర్ల, పరిగి, బొంరాస్‌పేట్ పరిధిలో చోటుచేసుకున్నాయి. నవాబుపేటలో ఆర్టీసీ బస్సు ఢీకొని ఓవ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని ఏక్‌మామిడి గ్రామ సమీపంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్ఐ భరత్‌భూషణ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పులమద్ది గ్రామానికి చెందిన బిల్లపాటి వీరయ్య(35) వికారాబాద్ నుంచి నవాబుపేటకు బైక్‌పై వెళ్తుండగా మార్గమధ్యలో ఏక్‌మామిడి గ్రామ సమీపంలో శంకర్‌పల్లి నుంచి వికారాబాద్‌కు వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వీరయ్యకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు 108 వాహనంలో వికారాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య మంజుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కులకచర్లలో బైక్‌పై వెళ్తూ యువకుడు..

కులకచర్ల: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని బండవెల్కిచర్లలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బాలకృష్ణ (27) శనివారం రాత్రి 9గంటల సమయంలో కులకచర్ల నుంచి బైక్‌పై బండవెల్కిచర్లకు వెళ్తున్నాడు. పాంబండ సమీపంలో ఎదురుగా వస్తున్న బైక్ అతివేగంగా వస్తూ ఢీకొట్టింది. ఈ ఘటనలో బాలకృష్ణకు గాయాలవడంతో 108వాహనంలో పాలమూర్ ఆసుపత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీశైలం తెలిపారు. మరో బైక్‌పై వెళ్తున్న మండలంలోని రాంనగర్ సూర్యనాయక్ తండాకు చెందిన గోపాల్‌కు తీవ్రగాయాలయ్యాయి.

పరిగిలో మరో యువకుడు..

పరిగి: మండలంలోని రంగంపల్లికి చెందిన ముగ్గురు బైక్‌పై వస్తూ ప్రమాదానికి గురయ్యారు. హైదరాబాద్-బిజాపూర్ హైవైపై బైక్ అదుపుతప్పి పడి నరేష్(20) మృతిచెందాడు. అయితే బైక్ అదుపుతప్పిందా? లేక గుర్తుతెలియని వాహనం ఢీకొందా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మరో ప్రమాదంలో గూడూరుకు చెందిన శ్రీనివాస్ తన కుమారుడిని తాండూరులో నవోదయ పరీక్ష రాయించుకుని తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో బైక్ అదుపుతప్పి పడడంతో తీవ్రగాయాలయ్యాయి. వీరిని పరిగి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో చికిత్స అందించి మెరుగైన వైద్యం నిమిత్తం హైదరాబాద్ తరలించారు.

బొంరాస్‌పేట్‌లో వాచ్‌మన్..

బొంరాస్‌పేట్, ఫిబ్రవరి 11: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదివారం జరిగింది. బొంరాస్‌పేట్ ఎస్ఐ అబ్దుల్ రవూఫ్ తెలిపిన వివరాల మేరకు కొడంగల్ మండలంలోని బుర్హుఖాన్‌పల్లికి చెందిన కృష్ణ(40) హైదరాబాద్‌లో వాచ్‌మన్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో సొంత గ్రామానికి వచ్చిన కృష్ణ ఆదివారం హైదరాబాద్‌కు వెళ్తుండగా బొంరాస్‌పేట్ మండలం రేగడిమైలారం సమీపంలో 163వ జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని వెనక నుంచి ఢీకొట్టాడు. ఈ ఘటనలో కృష్ణ అక్కడిక్కడే మృతిచెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆటో బోల్తా.. ఏడుగురికి గాయాలు

యాలాల, ఫిబ్రవరి 11: అదుపు తప్పి ఆటో బోల్తాపడి ఏడుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటన ఆదివారం యాలాల మండలంలోని అచ్యుతాపూర్ గేట్ సమీపంలో చోటుచేసుకుంది. యాలాల ఎస్ఐ శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. ముద్దాయిపేట్ నుంచి ఓ ఆటో బాగాయిపల్లి వైపు వెళ్తోంది. అచ్యుతాపూర్ గేట్ సమీపంలోకి రాగానే మూలమలుపు వద్ద ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న అన్నసాగర్ గ్రామానికి చెందిన లక్ష్మి, లక్ష్మీబాయి పేరున్న ఇద్దరు మహిళలు, నీలమ్మ, టేకులగడ్డతండాకు చెందిన శాంతిబాయి, విక్రమ్, బాగాయిపల్లికి చెందిన బుజ్జమ్మలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే వీరిని చికిత్స నిమిత్తం తాండూరు జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టివేత



మధ్యప్రదేశ్ నుంచి అక్రమంగా తరలిస్తున్న మద్యంను చూపుతున్న పోలీసులు

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 11: మధ్యప్రదేశ్ నుంచి అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. సీఐ గోవర్ధనగిరి తెలిపిన వివరాల ప్రకారం.. ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధి ఔటర్‌రింగ్‌రోడ్డు టోల్‌ప్లాజా వద్ద ఆదివారం తెల్లవారుజామున పోలీసులు తనిఖీలు చేపట్టారు. అజాగ్రత్తగా నిర్లక్ష్యంతో తప్పించుకోవడానికి యత్నించిన కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టగా మధ్యప్రదేశ్ నుంచి అక్రమంగా మద్యాన్ని రవాణా చేస్తున్నట్లు చెప్పారు. యాదాద్రి జిల్లా, రామన్నపేట్‌కు చెందిన బారుపాటి జగన్‌మోహన్(51), వనపర్తి జిల్లా, పెద్దమందడి మండలం, మణిగిల్ల గ్రామానికి చెందిన మేరెడ్డి ప్రశాంత్ రెడ్డి(28) కోలాపూర్ నుంచి అనుమతి లేకుండా సిగ్నిచర్ 84బాటిళ్లు, రాయల్‌స్టాగ్ 12బాటిళ్లు, ఆఫీసర్ చాయిస్ 90ఎంఎల్ 96 బాటిళ్లను తీసుకొస్తుండగా స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా తరలించిన మద్యం రూ.లక్ష విలువ ఉంటుందని చెప్పారు. మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ తనిఖీల్లో మల్కాజ్‌గిరి డివిజన్ అడిషనల్ డీసీపీ ప్రసాదరావు, ఉప్పల్ ఉమెన్ పోలీసుస్టేషన్ సీఐ మంజుల, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వివాహిత అదృశ్యం



లక్ష్మి

తాండూరురూరల్, ఫిబ్రవరి 11: ఆసుపత్రికని ఇంటి నుంచి వెళ్లిన మహిళ అదృశ్యమైంది. ఈ ఘటనకు సంబంధించి కరన్‌కోట్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొడంగల్ మండలం రుద్రారం గ్రామానికి చెందిన ఆడికి ఆశప్ప, భార్య లక్ష్మి(30) ఆరు సంవత్సరాలుగా తాండూరు మండలంలోని గౌతాపూర్ నాగేశ్వర్‌రావుకు చెందిన పాలిషింగ్ యూనిట్‌లో కూలీగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరికి కుమారుడు, కూతురు ఉన్నారు. అయితే లక్ష్మి ఆరోగ్యం బాగాలేకపోవడంతో ఈనెల 9వ తేదీన ఆసుపత్రికి వెళతానని ఇంట్లో చెప్పి తాండూరుకు వెళ్లింది. సాయంత్రం తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు జిల్లా ఆసుపత్రి, బంధువుల వద్ద విచారించారు. ఆచూకీ తెలియకపోవడంతో ఆదివారం కరన్‌కోట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

గ్రామాల్లో సమస్యలు లేకుండా చూడాలి



విలేకరులతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

బొంరాస్‌పేట్, ఫిబ్రవరి 11: సర్పంచుల పదవీకాలం ముగియడంతో గ్రామాల్లో ప్రజలకు సమస్యలు తలెత్తకుండా కాంగ్రెస్ కార్యకర్తలు ప్రజాసేవలో పాల్గొనాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆవుటి శేఖర్, నాయకులు మెరుగు వెంకటయ్య, ఖాజమీయ, శ్రీశైలంగౌడ్ తదితరులు అన్నారు. దుద్యాల మండల కేంద్రంలో ఆదివారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్ సౌకర్యం తదితర వాటి కోసం ప్రభుత్వానికి, ప్రజలకు అనుసంధానంగా పనిచేద్దామని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.